
మ్యూజియం కొలువై ఉన్న రాజా అన్నామలై మండ్రం భవనం


దేవాలయాల్లో వినియోగించే ఢంకా, నగరా

# పురాతన సంగీత వాయిద్యాల మ్యూజియం

- సందర్శకులను అబ్బురపరుస్తున్న వాయిద్యాలు
- విద్వాంసుల ఔన్నత్యాన్ని చాటుతున్న తైలవర్ణ చిత్రాలు

**కొరుక్కుపేట:** సంగీతం, నృత్యం వంటి కళలకు కేంద్రంగా చెన్నై నగరం విరాజిల్లుతుంది. భారతీయులే కాకుండా విదేశీయులు సైతం అమితంగా ఇష్టపడే కార్యక్రమాల్లో మార్గళి సంగీతోత్సవాలు ఒకటి. ప్రతి ఏడాది డిసెంబర్ నెల వచ్చిందంటే చాలు నగర వ్యాప్తంగా సంగీత ధ్వనులు వినిపిస్తూ పరవశింపజేస్తుంటాయి. డిసెంబర్, జనవరి నెలలు సంగీత విద్వాంసులతో, సంగీత వాయిద్యకారులతో, సంగీత ప్రియులతో కొత్తశోభను సంతరించుకుంటాయి. వందలాది విద్వాంసులు తమదైన సంగీతంతో పేరుప్రఖ్యాతులు పొందారు. దిగ్గజాలుగా పేరొందిన సంగీత విద్వాంసులు ఉపయోగించిన అరుదైన, పురాతన వాయిద్య పరికరాలతో కొలువైన 'తొల్‌ఇసై కలంజియం' పర్యాటకులను, సంగీత ప్రియులని అబ్బుర పరుస్తుంది.

శాస్త్రీయ సంగీత పోషణ, పరిరక్షణలో.. ప్రత్యేకించి తమిళ సంగీతానికి తమిళ్ ఇసై సంఘం గత ఏడుదశాబ్దాలకు పైగా ఎనలేని సేవలను అందిస్తుంది. రాజా సర్ అన్నామలై శెట్టియార్ అధ్యక్షుడిగా 1943 సంవత్సరం మే నెలలో ఏర్పాటైన తమిళ్ ఇసై సంఘం తరపున ప్రతి ఏడాది సంగీతోత్సవాలను నిర్వహిస్తున్నారు. సంగీతానికి శృతి, లయ చాలా అవసరం. శృతి కోసం హార్మోనియం, వయోలిన్ వంటి వాయిద్య పరికరాలు వాడుతుంటారు. అలాగే లయ కోసం మృదంగం, తబలా వంటి వాయిద్య పరికరాలు వినియోగిస్తుంటారు. ఈ వాయిద్య పరికాలు లేకుండా కచేరీలు జరగవు. ఇలాంటి పరికరాలను సేకరించి చెన్నై బ్రాడ్‌వే బస్టాండ్ టంగుటూరి ప్రకాశంపంతులు విగ్రహం సమీపంలో రాజా అన్నామలై మండ్రం భవనంలో తొల్ ఇసై కలంజియం (పురాతన వాయిద్య పరికరాల మ్యూజియం)ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఏర్పాటైన ఈ మ్యూజియాన్ని రాష్ట్ర గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ప్రారంభించారు.

## మంత్రముగ్ధులను చేస్తున్న మ్యూజియం:

మ్యూజియంలోకి అడుగు పెట్టగానే కనిపించే చెట్టినాడు వాస్తుతో నిర్మించిన స్తంబాలు మ్యూజియానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మ్యూజియాన్ని మూడు హాల్లుగా తీర్చిదిద్దారు. మొదటి హాలులో ప్రముఖ సంగీత విద్వాంసులతో పాటు రాజా అన్నామలై శెట్టియార్ తైల వర్ణ చిత్రాలు ఏర్పాటు చేశారు. అలాగే తమిళ ఇసై సంఘంతో ప్రముఖ సంగీత విద్వాంసులు ఎంఎస్ సుబ్బలక్ష్మీ అనుబంధాన్ని వివరించే ఛాయా చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. ఇదే హాలులో విజిటర్స్‌బుక్‌లో తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, 1950 నాటి మద్రాసు రాష్ట్ర గవర్నర్ బీష్మరామ్ మేధి, మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మైసూరు మహారాజు జయచామరాజా వొడేయర్, చక్రవర్తి రాజగోపాలచారి చేతిరాత ఉత్తరంలాంటివి ఎంతో జాగ్రత్తగా భద్రపరిచారు. తిరువారూర్, తిరుత్తురై పూండి ఆలయంలో ఉపయోగించిన పంచముఖ తబాలా, ఉత్తర భారతంలో స్వామివారి ఊరేగింపులో ఉపయోగించే నగారా, పురాతన నాధస్వరాలు, షెహనాయ్, ఢంకా, ప్రాచీన శృతిపెట్టే, పిల్లనగ్రోవి, శంఖం కొలువై ఉన్నాయి. ఇటీవల కనుమరుగవుతున్న 12 పంగానీ గిన్నెల జలతరంగంలు, ప్రస్తుత నాధస్వర విద్వాంసులు రాజారత్నంపిల్‌లై వాడిన నాధస్వరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.




పాశ్చాత్య గిటారా, రాజా అన్నామలై విగ్రహం, సితారా

## ప్రఖ్యాతుల వాయిద్యాలు:

మ్యూజియంలోని రెండో హాలులో ప్రముఖ సంగీత విద్వాంసులు ఉపయోగించిన సంగీత వాయిద్య పరికరాలను ఇక్కడే ప్రదర్శనగా ఉంచారు. చిన్న వేదికగా ఏర్పాటు చేసి ఎత్తైన పీఠం ఏర్పరచి లోహంతో తయారుచేసిన నటరాజ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బలక్ష్మీ తల్లి షణ్ముగవల్లి వినియోగించిన వీణ, వేణుగానం విద్వాంసులు డాక్టర్ ఎం.రమణీ కచేరిలో వినియోగించిన తంబురా, సంగీత విద్వాంసులు డీకే పట్టామ్మాళ్ శృతిపెట్టే, ఘటం విద్వాంసులు విక్కు వినాయక్‌రామ్ వినియోగించిన ఘటం, సంగీత విద్వాంసులు సీరిగాళి గోవిందరాజన్ వినియోగించిన తంబూర ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. నృత్యకారిణీ టి. బాలసరస్వతి, ఫిడేల్ (వయొలిన్) వాయిద్య కళాకారులు గోవింద స్వామి పిళ్లై, వాగ్గేయకారుడు, సంగీత దర్శకుడు పాపనాశం శివన్ తైలవర్ణ చిత్రాలు కనువిందు చేస్తాయి. నాధస్వరం, మృదంగం తయారు చేసే విధానాన్ని తెలిపే చిత్రాలు కూడా అబ్బుర పరుస్తాయి. మరో షోకేజీలో అరుదైన ప్రదర్శన వీణ, హంసవీణలు సంగీత కళాప్రియులను కళ్లుతిప్పనీయకుండా చేస్తాయి. మూడో హాలులో హిందూస్థాని సంగీతానికి సంబంధిచిన సితారతోపాటు ప్రాశ్చాత్య వాయిద్య పరికరాలైన గిటారాలు, జపాన్ వాయిద్య పరికరాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

### పరిరక్షణే ధ్యేయం:

ప్రాచీనకాలం నాటి సంగీత వాయిద్యాలను పరిరక్షించటమే ధ్యేయంగా మ్యూజియం ఏర్పాటైందని తమిళ్ ఇసై సంఘం కార్యదర్శి ఏఆర్ నాచియప్పన్, మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ లక్ష్మీ పొధువాల్ చెప్పారు. మ్యూజియం గురించి ఇంకా వివరిస్తూ మైలాపూర్ లోని శంకర్ మ్యూజికల్స్ కు చెందిన బాలాజీ, పుత్తూరుకు చెందిన ఏలుమణి ప్రస్తుతం మ్యూజియంలో ఉన్న పరికరాలను బాగు చేశారని తెలిపారు. అలాగే చిత్రకారులు రత్నం మ్యూజియంలోని 12 తైలవర్ణ చిత్రాలను రూపొందించారని తెలిపారు. మ్యూజియంలోని అరుదైన పురాతన వాయిద్యాలన్ని కూడా అద్దాల షోకేజీలో ఉంచి కాపాడుతున్నామని పేర్కొన్నారు.

## మ్యూజియం వేళలు.. టిక్కెట్ ధరలు:

మంగళవారం నుంచి ఆదివారం వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శనకు అనుమతి ఉంటుంది. 20 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన వారికి ప్రవేశ రుసుం రూ.20 వసూలు చేస్తున్నారు. 20 ఏళ్లలోపు వారికి, అలాగే 60 ఏళ్లు దాటిన వారికి ప్రవేశం ఉచితం. విదేశీయులకు అయితే రూ.200 టిక్కెట్ వసూలు చేస్తున్నారు. విద్యాసంస్థల నుంచి విద్యార్థులను తీసుకుని వచ్చేవారికి ఎంతమంది వచ్చినా రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. బ్రాడ్‌వే బస్టాండ్‌కు వచ్చే బస్సు ఎక్కి ఇక్కడకు సులువుగా చేరుకోవచ్చు. అలాగే ఎంఆర్‌టీఎస్ రైల్లో అయితే చెన్నై పోర్టు రైల్వేస్టేషన్ను, మెట్రోరైల్లో అయితే హైకోర్టు మెట్రోస్టేషన్ దిగితే మ్యూజియం వద్దకు సులువుగా చేరుకోవచ్చును.


పంచముఖ తబలా


కనువిందుగా హంస వీణ


ఎంఎస్ సుబ్బులక్ష్మి ఛాయాచిత్రాలు, విజిటర్‌బుక్


చెట్టినాడు వాస్తు కళాత్మకత


అరుదైన వాయిద్య పరికరాలు


విద్వాంసులు వినియోగించిన అరుదైన సంగీత వాయిద్య పరికరాలు